సమస్యల సుడిగుండంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని వైనం
- ఆధునిక కోర్సులపై విద్యార్థుల ఆసక్తి
- పాత చింతకాయ పచ్చడి కోర్సులపై విముఖత
- విద్యార్థినులకు వసతిగృహం నిర్మించినా నెరవేరని ప్రయోజనం
- కళాశాలలో వసతిగృహం ప్రారంభిస్తే చేరికలు పెరిగే అవకాశం
- కోఆర్డినేటర్ లేరని మూతబడిన 'దూరవిద్య'


తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖద్వారం


తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన మహిళా వసతి గృహ భవనం

తిరువూరు: నియోజకవర్గ కేంద్రమైన తిరువూరులో 1978 లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టకపోవడంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. గతంలో విద్యార్థి సంఘాల ఆందోళనతో ఆర్ట్స్, కామర్స్ కోర్సులతో పాటు సైన్స్ తరగతులు ప్రారంభించారు. అయితే గత 20 ఏళ్లలో ప్రపంచంలో మారుతున్న ఆధునిక సాంకేతికత నేపథ్యంలో అందుకనుగుణమైన కోర్సులు ఏవీ కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టలేదు. విద్యార్థులు ఆధునిక కోర్సులపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుత అవసరాల కనుగుణంగా కొత్త కోర్సులను ఎందుకు అందుబాటులోకి తీసుకురావట్లేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కళాశాలలో గతంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లలో విద్యార్థులకు అవకాశాలు కల్పించారు. గత కొద్ది సంవత్సరాలుగా కళాశాలలో కేవలం సాధారణ తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభిరుచికనుగుణంగా ఉపాధి, శిక్షణ కల్పించే కోర్సులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

వసతిగృహంలో తరగతుల నిర్వహణ

పట్టణానికి దూరంగా ఉన్న డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వసతిగృహ భవనాన్ని ప్రభుత్వం నిర్మించినా అందులో తరగతులు నిర్వహిస్తుండటంతో ఆశించిన ప్రయోజనం నెరవేరట్లేదు. విద్యార్థినుల వసతిగృహాన్ని కళాశాలలోనే ప్రారంభిస్తే చేరికలు పెరుగుతాయని పలువురు భావిస్తున్నారు.

పీజీ కోర్సులున్నా ఆదరణ కరువు

నాగార్జున, కృష్ణా విశ్వవిద్యాలయాలకు సుదూరంగా ఉన్న తిరువూరు ప్రాంతంలో పీజీ సెంటర్ ప్రారంభించాలని విద్యార్థుల చిరకాల కోరిక. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేవలం ఒకటి, రెండు కోర్సులతో పీజీ తరగతులను ప్రారంభించిన అధికారులు వీటికి సరైన ప్రచారం కల్పించట్లేదు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రవేశ పెట్టడంతో విద్యార్థులకు ఈ కోర్సులు భారమవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎక్కువగా ఉండే తిరువూరు ప్రాంతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవకాశం ఉన్న పీజీ కోర్సులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

దూరవిద్యకు రాంరాం...

కళాశాలకు వచ్చి డిగ్రీ చదువుకోలేని విద్యార్థుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన దూరవిద్యా కేంద్రం మూతబడింది. ఏటా 300 మందికి పైగా విద్యార్థులు ఈ కేంద్రం సేవలను వినియోగించుకుంటుండగా, కేవలం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌గా పనిచేయడానికి అధ్యాపకులు ముందుకు రావట్లేదనే కారణంతో దూరవిద్యా కేంద్రాన్ని మూసివేయడం ఎంతవరకు సమంజసమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్ లేకపోవడంతో నూజివీడు, విజయవాడ, సత్తుపల్లి, మధిర, ఖమ్మం వంటి దూర ప్రాంతాల్లోని కేంద్రాలకు వెళ్లి పరీక్షలు రాయడం, వారాంతపు తరగతులకు హాజరవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంది. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరనున్న ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం


గోపవరంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఎంపీటీసీ తదితరులు

ముసునూరు: ప్రతి ఇంటా, బయటా మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యం ఏర్పడి సమస్త జీవరాశి మనుగడకు దోహదపడుతుందని ఎంపీడీఓ పద్మావతీదేవి అన్నారు. మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు, ముసునూరు, యల్లాపురం గ్రామాల్లో ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటా విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్య నివారణ కోసం వేప, మర్రి, కానుగ మొక్కలను పెంచాలని ప్రజలకు సూచించారు. వాతావరణ కాలుష్య నివారణ, పర్యావరణ సమతుల్యం కోసం పాఠశాలల యాజమాన్యాలు విద్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


చెక్కపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్

ముసునూరు: సైబర్ నేరాల వలలో పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించేలా ప్రజల్లో చైతన్యం రావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజర్ ఆర్.ప్రవీణ్ కుమార్ సూచించారు. చెక్కపల్లిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సైబర్ నేరాల నిరోధంపై సోమవారం బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారులు, రైతులు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పల్లెలు, పట్టణాల్లో సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, లోన్ యాప్‌ల పేరుతో అందరినీ బురిడీ కొట్టిస్తున్నారని అన్నారు. ఏటీఎంల వద్ద నగదు బయటకు తీసుకునే సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.సైబర్ నేరాల బారి నుంచి కాపాడుకునేందుకు ప్రజల్లో చైతన్యం అవసరమన్నారు. లోన్ యాప్‌ల బారిన పడకుండా జాగ్రత్త వహించేలా ప్రజలను చైతన్యపర్చాలని సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాల నిరోధానికి టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాల్లో నగదు అధికారి తిరుపతిరావు, అకౌంటెంట్ శివయ్య, వినియోగదారులు పాల్గొన్నారు.

నూజివీడు ఎస్‌బీఐలో...

నూజివీడు: పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో సైబర్ నేరాలపై సోమవారం బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ ఎం.హనుమంత నాయక్ మాట్లాడుతూ ఖాతాదారుల బలహీనతలను ఆసరాగా చేసుకొని బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల నుంచి వారి ఓటీపీ నంబరు తెలుసుకొని బ్యాంకు ఖాతాలోని నగదు చోరీ చేస్తున్నారన్నారు. కేవైసీ అప్‌డేట్ చేస్తామని, లాటరీ తగిలిందని, లోన్ ఎలిజిబిలిటీ ఉందని చెప్పి మోసం చేయడానికి ఫోన్ చేస్తుంటారన్నారు. వారి మోసపూరిత మాటలు నమ్మి ఓటీపీ చెప్పవద్దని హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కి వెంటనే ఫోన్ చేసి తెలపాలన్నారు. అలాంటి నంబర్లను బ్లాక్ చేసుకోవాలని కోరారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల మాటలకు మోసపోయి నగదు బదిలీ చేస్తే సదరు బ్యాంకులో సమాచారం అందించి లావాదేవీలను వెంటనే నిలుపుదల చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు

నూజివీడు: రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో తేజోమణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని వాపోయారు. పాఠశాల ఫీజు కాకుండా అడ్మిషన్ ఫీజు, బస్సుల ఫీజు, నోటు బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయలను అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.1,500కు లభ్యమయ్యే పాఠ్య పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి స్కూల్లో రూ.3వేల నుంచి రూ.4వేలకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తమ పిల్లలకు మంచి విద్యను అందించాలంటే తలకు మించిన భారంగా తయారైందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు సంబంధించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తప్పకుండా తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నూజివీడు నియోజకవర్గ నాయకులు పి.ప్రవీణ్, పి.ప్రేమ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి


తిరువూరులో ఏఐవైఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

తిరువూరు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మెగా డీఎస్సీ నిర్వహణకు కార్యాచరణ చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు కోరారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. మెగా డీఎస్సీ నిర్వహణ ఫైలుపైనే తొలి సంతకం చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఉపాధ్యాయ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లింపు, 20 లక్షల ఉద్యోగాల భర్తీ తదితర హామీలను కూడా నెరవేర్చడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సుభానీ, తిరువూరు పట్టణ శాఖ అధ్యక్షుడు మురళి, జిల్లా కోశాధికారి మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ అమ్మవారి హుండీ కానుకలు రూ.8.25లక్షలు


మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను విజయవాడ లోని మాచవరం దాసాంజనేయ స్వామి దేవస్థానం ఈఓ ఎన్.భవాని పర్యవేక్షణలో సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వై.సీతారామయ్య తెలిపారు. దేవస్థానంలో ఉన్న నాలుగు హుండీల లోని కానుకలను లెక్కించగా 75 రోజులకు గాను రూ.8,25,798 ఆదాయం సమకూరిందన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు, సత్యసాయి భక్తసమాజం సభ్యుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించినట్లు ఈఓ తెలిపారు.

మీర్జాపురం సొసైటీ అధ్యక్షుడికి సన్మానం


నూజివీడు మండలం మీర్జాపురం సొసైటీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న రైతులు, సిబ్బంది

నూజివీడు: మీర్జాపురం సొసైటీ అధ్యక్షుడు బడుగు రంగారావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం రైతులు, సంఘ ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. సహకార సంఘం అభివృద్ధికి బడుగు రంగారావు కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఆయన్ను రైతులు, ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు గోళ్ళ లోకేశ్వరరావు, పాలకేంద్రం సొసైటీ మాజీ అధ్యక్షుడు అట్లూరి వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి రాజబాబు, గోళ్ళ విజయరాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ బడుగు రవి, దోనేపూడి సూరయ్య, సత్యనారాయణ, దండుపోయిన శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో నీలం నాగేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి భక్తుల విరాళాలు

ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయానికి భక్తులు విరాళాలు అందజేశారు. స్వామివారి నిత్య ధూప దీప నైవేద్యాలకు శ్రీరామ్ హరిప్రసాద్, శ్రీకాకుళం వెంకట నాగేంద్రం రూ.2 లక్షలు, వార్డు మెంబర్ యండూరి ప్రణీత్ రూ.50 వేలు ఆలయ కమిటీ కార్యదర్శి మడుపల్లి గోపాల్, ఉపాధ్యక్షుడు బెజవాడ ముత్యాలుకు అందజేశారు.

మైలవరం జమీందారును కలిసిన ఎమ్మెల్యే వసంత



మైలవరం: మైలవరం జమీందారు, ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకర రావును మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జమీందారు సుధాకరరావు ఆయన్ను శాలువాతో సత్కరించి అభినందించారు. మైలవరం అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు. అనంతరం జమీందారు సుధాకరరావును ఎమ్మెల్యే వసంత శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యదర్శిగా కొవ్వలి కోటమ్మ



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శిగా కొవ్వలి కోటమ్మ ఎన్నికైనట్టు అధ్యక్షుడు వేణుగోపాలరావు తెలిపారు. ఆగిరిపల్లిలో సోమవారం మండల ఎస్టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈదుల గూడెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కొవ్వలి కోటమ్మ ఎస్టీయూ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

శ్రీతిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.3.97లక్షలు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల హుండీ ఆదాయం రూ.3,97,500 వచ్చినట్లు దేవాలయ కార్యనిర్వహణ కార్యదర్శి బొగ్గవరపు రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు నెలల 28 రోజులు తరువాత ఆలయ ధర్మకర్త చెలికాని వెంకట సత్య వరప్రసాద్, అంబారుపేట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి పామర్తి సీతారామయ్య, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరిగిందని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. నూజివీడు మండలం ముఖాసానరసన్నపాలెం గ్రామానికి చెందిన గూడూరు లీలవెంకటసత్య సుభాష్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,10,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

క్లుప్తంగా

పేస్కేల్ సవరణ చేయాలని సీఎస్‌కు వినతి



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా యూనియన్ సభ్యులతో కలసి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో సోమవారం పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వార్డు, సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పదోన్నతుల సమస్యలు, పే స్కేల్ సవరణ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రోజా ప్రకాష్, సమాచార కార్యదర్శి రాజేష్‌బాబు, రాష్ట్ర సమన్వయకర్త శశిధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబూరావు కుటుంబానికి ఆర్థిక సహాయం



చాట్రాయి: మండల విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కంకట బాబూరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఆధ్వర్యంలో మృతుడి భార్య మంజులతకు రూ.1.76 లక్షల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాచారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి శఠగోపం సమర్పణ



చాట్రాయి: సి.గుడిపాడులోని నాగ లింగేశ్వరస్వామి ఆలయానికి ఎన్టీఆర్ జిల్లా ముష్టికుంట్ల గ్రామానికి చెందిన గద్దె ప్రదీప్, రమ్య దంపతులు రూ.1.05 లక్షలు విలువ చేసే వెండి శఠగోపం, వెండి ప్లేటును సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శరత్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లు సత్యనారాయణరెడ్డి, మందపాటి రఘుపతిరెడ్డి, దేశిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు అల్లా ఆశీస్సులు ఉండాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఈనెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబుకు అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ఆకాంక్షించారు. చంద్రబాబుకు అల్లా ఆశీస్సులు కోరుతూ కొండపల్లి షాబూఖారీ దర్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా మత గురువు ఆల్తాఫ్ రజా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముస్లిం మైనార్టీలకు సీఎంగా చంద్రబాబు పెద్దపీట వేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. నిత్యాన్నదాన లంగర్‌ఖానా పరిశీలించారు. దర్గాలో పేదలకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమన్నారు. మషాయక్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ జకావుద్దీన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ ఐపాక్‌ను నమ్మి మోసపోయారు

తిరువూరు మాజీ ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరు: ఐప్యాక్ సూచనలు, ప్రభుత్వ సలహాదారుల మాటలు నమ్మి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసపోయారని తిరువూరు మాజీ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. ప్రజల్లో తిరిగే తమవంటి శాసన సభ్యులను గుర్తించలేదన్నారు. తిరువూరులోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పరిస్థితుల కనుగుణంగానే తాను కూటమికి మద్దతుగా ప్రచారం చేశానన్నారు. రాష్ట్రంలో అందరికంటే ఎక్కువగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రజలు ఆదరించారని చెప్పారు. తన రాజకీయ భవిష్యత్తుపై ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదన్నారు.

ఆగిరిపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్ష పదవికి రాజీనామా

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్ష పదవికి పల్లగాని నరసింహారావు సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నానని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానికి పంపించానని చెప్పారు. ఇప్పటి వరకు పార్టీ మండల అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రత్యేకావసరాలు గల బాలబాలికల గుర్తింపు



విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో ప్రత్యేకావసరాలు గల బాలబాలికలు 19 మందిని గుర్తించినట్లు ఎంఈఓ ఇ.సుధాకర్ తెలిపారు. ప్రత్యేకావసరాలు గల బాలబాలికల గుర్తింపు సర్వేలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రత్యేకావసరాలుగల పిల్లల కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక విద్యను అందిస్తోందని తెలిపారు. ప్రతి సోమవారం భవిత కేంద్రంలో అవసరమైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తారన్నారు. సంవత్సరానికి ఒకసారి స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. ప్రత్యేకావసరాలు గల బడి ఈడు పిల్లలందరూ భవిత కేంద్రం లేదా స్థానిక పాఠశాలల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉపాధ్యాయులు ఎం.కృష్ణప్రసాద్, డి.రాముడు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి


గొల్లపూడి నారాయణరావు (ఫైల్)

నూజివీడు: పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది గొల్లపూడి నారాయణరావు (73) ఆదివారం బెంగళూరులో మృతి చెందారు. ఈయన కొన్నాళ్లుగా అనారోగ్యంతో అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నారాయణరావు మృతి పట్ల 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, భారత్ బార్ అసోసియేషన్ నాయకులు వైఎస్ దొరై, ఆర్వీ సత్యనారాయణ, బసవరాజు రామకృష్ణ, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం తెలియజేశారు. నారాయణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పైడిమర్రి దేశభక్తికి ప్రతిజ్ఞ నిదర్శనం

తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ అన్నారు. తిరువూరు వాణీ హిందీ విద్యాలయంలో సోమవారం ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు 108వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రఘునందన్ మాట్లాడుతూ 1962లో ఆంధ్రుడైన పైడిమర్రి తెలుగులో రాసిన ప్రతిజ్ఞను తదుపరి అన్ని భాషల్లోకి అనువదించారని, దేశవ్యాప్తంగా ఈ ప్రతిజ్ఞను విద్యార్థులు ఆలపించడం తెలుగువారికి గర్వకారణమన్నారు. సర్వమత సమానత్వం, భిన్నత్వంలో ఏకత్వం ప్రాముఖ్యతను ప్రతిజ్ఞ చాటి చెబుతుందన్నారు. పైడిమర్రి చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.